


హెచ్ఎండిఎ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై మిని బతుకమ్మ ఉత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాల దృశ్యం



హైదరాబాద్ వార్త



# మూసీ ఉగ్రరూపం..

- పరివాహక ప్రాంతాలన్నీ అతలాకుతలం
- నీట మునిగిన ఎంజిబిఎస్
- చాదర్‌ఘాట్, ముసారంబాగ్‌లలో వంతెనల పైనుంచి వరద నీరు
- రాకపోకలు నిలిపివేత ..
- బిక్కుబిక్కుమంటూ సమీప ప్రాంతాల ప్రజలు
- అప్రమత్తమైన హైడ్రా, జిహెచ్ఎంసి
- పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- డ్రోన్‌లతో ఆహారం, నీరు అందజేత
- పునరావాస కేంద్రాలల్లో 2వేలకు పైగా బాధితులు

**హైదరాబాద్, గోషామహల్ సెప్టెంబరు 27,ప్రభాతవార్త:** గత కొద్ది రోజులుగా కురిసిన కుండపోత వానలకు మూసీ, ఈసీ నదులు ఉగ్రరూపం దాల్చాయి. జంట జలాశయాలకు వరద పోటెత్తడంతో గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. దీంతో హైదరాబాద్‌లోని మూసీ పరివాహక ప్రాంతాలు, సమీప బస్తీలు నీట మునిగాయి. లోతట్టు కాలనీల ఇళ్లలోకి వరద చేరింది. ఫలితంగా స్థానికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. గంట గంటకు వరద ఉదృతి పెరుగుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి సైతం అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ, హైడ్రా, డీఆర్ఎఫ్ సిబ్బందిని అదేశించారు. మూసీకి ఒకేసారి 35 వేల క్యూసెక్కుల వరద రావడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఈసీ, మూసీకి వరద తాకిడి పెరగడంతో జలమండలి అధికారులు అప్రమత్తమై ఉస్మాన్‌సాగర్ ,హిమాయత్‌సాగర్, గేట్లను ఎత్తి 35 వేల క్యూసెక్కులకు పైగా నీరు మూసీ నదిలోకి విడుదల చేశారు. ఒకేసారి అంత పెద్ద మొత్తంలో నదిలోకి ప్రవాహం పోటెత్తడంతో పరివాహక ప్రాంతాల్లోని రోడ్లు, వంతెనలు, కాలనీలు నీట మునిగాయి. ఈ ప్రభావం బాపూఘాట్ నుంచి మూసారాంబాగ్ వరకు తీవ్రంగా కనిపించింది. మూసానగర్, రసూల్‌పురా, వినాయక వీధి, శంకర్‌నగర్‌లలో వందల ఇళ్లు నీట మునిగాయి. మూసీ వరదల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న దాదాపు 2వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. చాదర్‌ఘాట్, ముసారాంబాగ్ వంతెనలపై వాహన రాకపోకలను నిలిపేశారు. మూసీ బ్రిడ్జిలను తాకుతూ వరద ప్రవహిస్తోంది. వంతెనపై స్లాబ్ వేసేందుకు ఏర్పాటు చేసిన ఇనుప సెంట్రిగ్ భారీ శబ్ధాలతో కొట్టుకుపోయింది. సుమారు కోటిన్నర నష్టం వాటిల్లిందని వంతెన నిర్మాణ సూపర్‌వైజర్ తెలిపారు.మూసారాంబాగ్ బ్రిడ్జి సమీపంలోని అంబేద్కర్ నగర్ బస్తీ, మూసానగర్, రసూల్‌పురా, వినాయక వీధి, శంకర్‌నగర్‌లలో ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఊహించని విధంగా రాత్రి వేళలో వచ్చిన ప్రవాహ తాకిడికి కుటుంబాలు అల్లాడిపోయాయి. నిత్యావసరాలు, ఇతర సామన్లు తడిచిపోయాయి. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు వాపోయారు.అలాగే వేలాది ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉండే మహాత్మాగాంధీ బస్టాండ్ ఆవరణలోకి మూసీ వరద చుట్టుముట్టింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రవాహ తీవ్రత దృష్ట్యా అప్రమత్తమైన అధికారులు ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బస్సులను అక్కడి నుంచి వేరేచోటకు పంపించారు. తాత్కాలికంగా బస్సులను లోనికి అనుమతించడం లేదని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. మూసీ వరద ఎంజీబీఎస్‌లోకి వచ్చిన సమయంలో సుమారు మూడు వేల మంది ప్రయాణికులు బస్టాండ్‌లో ఉన్నారని కస్టమర్ రిలేషన్ ఆఫీసర్ సుఖేందర్ రెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను దారి మళ్లించినట్లు వివరించారు. ఖమ్మం, నల్గొండ, మిర్యాలగూడ నుంచి వచ్చే బస్సులు దిల్‌సుఖ్‌నగర్ వరకే అనుమతించారు. కర్నూలు, మహబూబ్‌నగర్ నుంచి వచ్చే బస్సులు ఆరాంఘర్ వరకే నడిపేలా చర్యలు చేపట్టారు. వరంగల్, హనుమకొండ నుంచి వచ్చే బస్సులు ఉప్పల్, ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్ నుంచి వచ్చే బస్సులు జేబీఎస్‌కే అనుమతించారు.

**వంతెనపైలపై రాకపోకలు నిలిపివేత..**

హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ బ్రిడ్జి వద్ద మూసీనది ఉధృతంగా ప్రవహిస్తుంది. చాదర్‌ఘాట్ చిన్న వంతెనపై 6 అడుగుల మేర వరద ప్రవాహం ప్రమాదకరంగా ఉంది. దీంతో అధికారులు చాదర్‌ఘాట్ చిన్న వంతెనపై రాకపోకలు నిలిపివేశారు. కోఠి, నాంపల్లి మార్గాలకు ఒక వంతెన పైనుంచే రాకపోకలు సాగుతున్నాయి. దీంతో ఆ వంతెనపై రద్దీ పెరిగింది. చాదర్‌ఘాట్ వద్ద మూసీ పక్కన ఉన్న కాలనీల్లోకి వరదనీరు చేరింది. చాదర్‌ఘాట్ చిన్న వంతెన పరిసరాల్లోని ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో లోతట్టు కాలనీ వాసులను అధికారులు ఖాళీ చేయించారు. అలాగే అంబర్‌పేట-దిల్‌షుఖ్‌నగర్ మధ్యలోని మూసారాంబాగ్ వద్ద ప్రమాదకరంగా మూసీ ప్రవహిస్తుంది. వంతెన పైనుంచి వరదనీరు వెళుతుంది. మూసారాంబాగ్ పాత వంతెనపై 10 అడుగుల మేర వరద ప్రవాహం ఉంది. నిర్మాణంలో ఉన్న కొత్త వంతెనను కూడా తాకుతూ వరద ప్రవహిస్తుంది. నిర్మాణంలో ఉన్న కొత్త వంతెన సామగ్రి వరద నీటిలో కొట్టుకుపోయింది.అలాగే నార్సింగి, హిమాయత్‌సాగర్ వద్ద సర్వీస్ రోడ్ పూర్తిగా మూసివేశారు. మంచిరేవులనార్సింగికి వెళ్లే సర్వీస్ రోడ్‌లో ప్రయాణికులకు వెళ్లకుండా రహదారిని మూసివేశారు.

**అప్రమత్తమైన జీహెచ్ఎంసీ..**

నది ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాలతో జోనల్, డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు రంగంలోకి దిగారు. ఆయా ప్రాంతాల్లోని ముంపు బాధితులను సుమారు 1,500 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. వారికి భోజనం, తాగునీరు ఏర్పాట్లు చేయడంతోపాటు దుప్పట్లు అందజేశారు. వైద్య సదుపాయం అందుబాటులో ఉంచారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించిన కర్ణన్ అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. హుస్సేన్‌సాగర్‌లోనూ నీటి మట్టం పూర్తి నీటి నిల్వ సామర్ధం దాటింది. దీంతో సర్‌ప్లస్ నాలా తీర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

**డ్రోన్ ద్వారా ఆహారం పంపిణీ చేసిన హైడ్రా**

మూసీ పరివాహక ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ఎంజీబీఎస్ చేరుకున్న హైడ్రా కమిషనర్ ఎంజీబీఎస్‌లో పరిస్థితిని పరిశీలించారు. సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. మలక్‌పేటలోని మూసానగర్‌లో వరద ఇళ్లను చుట్టుముట్టింది. మూసీ ప్రవాహంలో చిక్కుకున్న వారికి అధికారుల సాయం అందించారు. మలక్‌పేట పరిధిలో బాధితులకు డ్రోన్ ద్వారా ఆహారం సరఫరా చేశారు. డ్రోన్ ద్వారా హైడ్రా కమిషనర్ రంగనాథ్, మలక్‌పేట ఎమ్మెల్యే ఆహారం పంపారు.

**నలుగురిని కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు**

నార్సింగి మంచిరేవుల మధ్య ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డులో వరదలో చిక్కుకున్న నలుగురిని హైడ్రా బృందాలు శుక్రవారం రాత్రి కాపాడాయి. ఉస్మాన్ సాగర్ (గండిపేట) గేట్లు ఎత్తడంతో భారీగా వచ్చిన వరదతో సర్వీసు రోడ్డు మీద నుంచి వరద పారుతోంది. ఆ మార్గంలో వెళ్లరాదని బారికేడ్లు పెట్టినా పట్టించుకోకుండా ఆటో ట్రాలీ లో రోడ్ దాటేందుకు ప్రయత్నించాడు డ్రైవర్. అప్పుడు ఆటో ట్రాలీలో డ్రైవర్ తోపాటు నలుగురు ఉన్నారు. కొంత దూరం వెళ్ళేసరికి వరద ఎక్కువ ఉండడంతో ఆటో ట్రాలీ ఆగిపోయింది. అక్కడ ఉన్న పోలీసులు, హైడ్రా సిబ్బంది గమనించి వాళ్ళని కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఆటో ట్రాలీ కి తాడు కట్టి బయటకు లాగారు.

**మూసి పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్, కమిషనర్**

చాదర్ ఘాట్ బ్రిడ్జి, ఎంజీబీఎస్ బస్ స్టేషన్ , మలక్ పేట లోని పునరావాస కేంద్రాలకు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్,మేయర్ గద్వాల విజయ లక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్,హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన ,ఇతర అధికారులు పరిశీలించారు.జంట జలశయాల గేట్లు ఎత్తడంతోపై నుండి వస్తున్న వరద వల్ల చాదర్ ఘాట్ బ్రిడ్జి మునిగిపోవడంతో అక్కడ బ్రిడ్జిని పరిశీలించారు.వరద ప్రభావం అధికంగా ఉండడంతో బ్రిడ్జి పై ప్రజలను ఎవరిని అనుమతించవద్దని పోలీసులను ఆదేశించించారు. చాదర్ ఘాట్ బ్రిడ్జి సైడ్ వాల్స్ దెబ్బతినడంతో వరద తగ్గిన తరువాత వెంటనే బ్రిడ్జి పై నుండి ఎవరిని అనుమతించవద్దని సూచించారు. అలాగే వరద దాటికి మునిగిపోయిన ఎంజీబీఎస్ బస్ స్టేషన్ ను పరిశీలించారు.. బస్సులు డైవర్ట్ చేయడంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తీసుకున్న చర్యల పై ఆరా తీశారు. అలాగే జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ శనివారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. శనివారం ఉదయం ముసారాంబాగ్ వద్ద మూసీ నదిపై నిర్మాణంలో ఉన్న కొత్త వంతెన పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన వంతెన పనులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని ఇంజనీర్లు కమిషనర్‌కు తెలిపారు.వరద ఉద్ధృతికి కారణంగా పిల్లర్ల మధ్య ఏర్పాటు చేసిన సెంట్రింగ్ మాత్రమే కొట్టుకుపోయిందని ఇంజనీరింగ్ అధికారులు కమిషనర్‌కు వివరించారు. తరువాత కమిషనర్ అంబర్‌పేట సర్కిల్‌లోని గోల్నాక లంక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జీహెచ్ఎంసీ పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. వరద ప్రభావితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అలాగే హైడ్రా కమిషనర్ రంగనాథ్ చాదర్ ఘాట్, మూసారంబాగ్, ఎంజీబీ ఎస్, నార్సింగి ప్రాంతాల్లో వరద ఉధృతిని తనిఖీ చేసారు. అక్కడ వరదలో చిక్కుకుని భవనాలపై ఉన్నవాళ్ళకి డ్రోన్స్ ద్వారా ఆహారం అందించడాన్ని పరిశీలించారు.



సహాయక చర్యల్లో పాల్గొన్న సిబ్బంది



బాధితులకు డ్రోన్ ద్వారా ఆహార పదార్థాలు అందజేస్తున్న దృశ్యం



పూర్తిగా జలదిగ్బంధం అయిన మహాత్మాగాంధి బస్‌స్టాండ్



## హైదరాబాద్ కొత్త కొత్వాల్‌గా సజ్జనార్

### ట్రై కమిషనరేట్‌లో పలువురు కొత్తవారి రాక

**హైదరాబాద్, సెప్టెంబరు 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు కొత్త బాస్‌గా విశ్వనాథ్ చెన్నప్ప సజ్జన్నార్ (విసి సజ్జన్నార్) నియ మితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సి.వి ఆనంద్‌ను హోం శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించి ఆయన స్థానంలో ఆర్టీసీ ఎండిగా వున్న సజ్జనా ర్‌ను సర్కారు ని యమించింది. ఆయ నతో పాటు నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్)గా సిఐడిలో వున్న ఎం. శ్రీనివాసులును ని యమించారు, నగర శాంతి భద్రతల జాయింట్ పోలీసు కమిషనర్‌గా మల్టీ జోన్ 6 డిఐజిగా వున్న తఫ్సీర్ ఇక్బాల్‌ను నియమించారు. ఈ పోస్టు లో చాలా కాలంగా ఐజి క్యాడర్ అధికారిని నియమించగా చాలా కాలం తరువాత డిఐజి క్యాడర్ అధికారిని నియమించారు. నగర పోలీసు విభాగం లో మూడు కీలక పోస్టులకు ఒకేసారి కొత్తవారి నియామకం జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. కాగా వీరితో పాటు ట్రై కమిషనరేట్‌లో పలువురు కొత్త డిసిపిలు నియమితులయ్యారు. పశ్చిమ మండల డిసిపిగా రాజేంద్ర నగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్‌ను నియ మించగా ఆయన స్థాన ంలో నారాయణ్‌పేట్ ఎస్పిగా వున్న యోగేష్ గౌతం బదిలీ అయ్యారు. మాదాపూర్ డిసిపిగా రితిరాజ్ నియమితులవగా ఎల్‌బి నగర్ డిసిపిగా సిద్ది పేట్ కమిషనర్‌గా వున్న అనురాధ బదిలీ అయ్యారు. హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా నియమితులైన సజ్జన్నార్ ఇంతకు ముందు హైదరాబాద్ పో లీసు విభాగంలో పనిచేసిన అనుభవం లేక పోవడం గమనార్హం. వరంగల్ ఎస్పిగా వున్న సమయంలో అమ్మాయిలపై జరిగిన యాసిడి దాడి నింది లు, సైబరాబాద్ కమిషనర్‌గా వున్న సమయంలో శంషాబాద్‌లో వెటర్నరీ వైద్యురాలి హత్యాచార ఘటనలో జరిగిన ఎన్‌కౌంటర్లతో సజ్జన్నార్ పేరు దేశ వ్యాప్తంగా మారుమోగింది. వెటర్నరీ వైద్యురాలి హత్యాచార ఘటనకు బాధ్యులైన ముగ్గురు కామాంధులు చటాన్‌పల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమవడం సంచలనం రేపింది. నగర అదనపు పోలీసు కమిషనర్ (క్రైం అండ్ సిట్)గా నియమితులైన ఎం.శ్రీనివాసులు ఇంతకు ముందు సిటీ సాయుధ బలగం జాయింట్ సిపిగా పనిచేశారు. పశ్చిమ మండల డిసిపిగా నియమితులైన చిం తమనేని శ్రీనివాస్ 1991 బ్యాచ్ ఎస్ఐ మావోయిస్టు ఉద్యమం తీవ్రంగా వున్న సమయంలో యాదగిరిగుట్ట పోలీసు స్టేషన్‌ను నక్సలైట్లు పేల్చివేయగా స్వల్ప వ్యవధిలోనే ఈ పేలుడుకు కారణమైన నక్స ల్స్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యారు. దీనికి శ్రీనివాస్ నేతృత్వం వహించారు. ఇంతకు ముందు సైబరాబాద్‌లో సిఐగా ఎసిగా పనిచేసిన ఆయన నగర పోలీసు విభాగంలో అదనపు డిసిపి, డిసిపి సెక్యూరిటీ విభాగంలో కొంతకాలం పనిచేశారు. మిగతా అధికారులు ట్రై కమిషనరేట్‌కు కొత్తగా నియ మితులయ్యారు.

## రాజరాజేశ్వరీదేవీగా దర్శనమిచ్చిన పెద్దమ్మతల్లి



**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జూబ్లీ హిల్స్ పెద్దమ్మ తల్లి రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శ నమిచ్చింది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 3 గంటలకు పెద్దమ్మతల్లికి అభిషేకం నిర్వహించారు. అనంతరం వివిద పూజా కార్యక్రమాలు జరిగాయి. 10 గంటలకు స్తపశతి పారాయణం, వేదపారాయణం, మధ్యాహ్నం 1 గంటకు మహానివేదన, రాత్రి 8 గంటలకు పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తి పల్లకిసేవ, పవళింపు సేవ నిర్వ హించారు. ఉత్సవాల్లో ఆలయ వ్యవస్థాపక సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలి సి పాల్గొన్నారు. అక్టోబరు 1న ఆలయ ప్రాంగణంలో లలితా సహస్రనామ కుంకుమార్చన ఉంటుందని,

## ఎమ్మెల్యే దానం ఇంట్లో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ వేడుకల్లో ఆడిపాడుతున్న దానం నాగేందర్ సతీమణి, మనువరాళ్లు కుటుంబ సభ్యులు.

**బంజారాహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే దానం నాగేందర్ నివాసంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయ నాయకులతోపాటు పారిశ్రామికవేత్తలు, కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం నివాసంలో వివిధ ఎత్తుల్లో బతుకమ్మలను పేర్చారు. దానం సతీమణి దానం అనిత, తన కుమార్తె, మనువరాళ్లతో కలిసి బతుకమ్మ పాటలు పాడారు. ఈ సందర్భంగా దానం నివాసాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మనువరాళ్లు బతుకమ్మ ఆటను చూసిన దానం నాగేందర్ ఆనందానికి అవధులు లేవు.

## ఏడుకొండలవాడి ఆలయంలో 'సేవా'నందం


స్వామివారి సూర్యప్రభవాహన సేవలో పాల్గొన్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

**జూబ్లీహిల్స్, సెప్టెంబరు 15, ప్రభాతవార్త:** శ్రీనగర్‌కాలనీలో వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలో భాగంగా శనివారం వివిధ రకాల సేవలు, పూజలతో ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు సూర్యప్రభ వాహన సేవను, రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహన సేవను నిర్వహించారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించారు. సేవల్లో భాగంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని వాహనంపై ఆలయ వీధుల్లో ఊరేగించారు. ఏడుకొండలవాడ అంటూ భక్తులు భక్తిపారవశ్యంతో ముందుకు సాగారు.

**లలితాదేవి అలంకారంలో..**

వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని భ్రమరాంబిక దేవి అమ్మవారు శనివారం భక్తులకు లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం కావడంతో భక్తులు ఉదయం నుంచి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

### ఘనంగా పురపాలక సంఘ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**దుండిగల్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

పురపాలక సంఘ కార్యాలయం ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ వేడుకల్లో కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, రెవెన్యూ ఆఫీసర్ వి. నాగేశ్ బాబు, మేనేజర్ బి. లక్ష్మయ్య, అలాగే కార్యాలయ సిబ్బంది పాల్గొని బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని, పూలతో సాగే ఈ పండుగ సాంప్రదాయ విలువలు, మహిళల ఆత్మగౌరవాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఇలాంటి సంప్రదాయ పండుగలను ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.

## డిసిపి కోటిరెడ్డిని కలిసిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డిసిపి కోటిరెడ్డి

**పేట్ బషీరాబాద్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

బెంగళూరులో నిర్వహించిన నేషనల్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు శనివారం డిసిపి కోటిరెడ్డిని కలిసారు. ఈ సందర్భంగా డిసిపి విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, పెద్ద లక్ష్యాలను సాధించేందుకు మంచి పథకాలు అవలంబించాలని సూచించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలుగు సినీ యూనియన్‌లో దొంగ సభ్యత్వాలు..

**తెలుగు సినిమా వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి**



**చిక్కడపల్లి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** తెలుగు సినీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్లో దొంగ సభ్యత్వాలతో యూనియన్ ఎన్నికల్లో గెలిచేందుకు కొందరు పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకు గాను 28న జరు గనున్న ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ తెలంగాణ సినిమా వేదిక సభ్యులు పలువురు శనివవారం రాష్ట్ర కార్మికశాఖ అదనపు కమిషనర్ డా.ఇ. గంగాధర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలుగు సినిమా వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు, సలహాదారు తుమ్మల ప్రపుల్రాంరెడ్డి, అధ్యక్షులు లారా, కార్యదర్శి మోహన్ భైరాగిలు మాట్లాడుతూ తెలుగు డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్‌లో వెల్లంకి శ్రీనివాస్, కెడి రాజు, నర్సింహారెడ్డి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతుందన్నారు. ఈ ముగ్గురు సభ్యత్వం పేరిట సేకరి ంచిన డబ్బుల లెక్కలు తేలిన తర్వాత, దొంగ సభ్యత్వాలను తొలగించిన పిదప ఎన్నికలు నిర్వహించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కార్మికశాఖ అదనపు కమి షనర్ గంగాధరన్ను కోరినట్లు వివరించారు. గత పది సంవత్సరాలుగా యూనియన్లో సభ్యత్వాల డబ్బు ఎంత వచ్చింది. రెన్యూవల్స్ డబ్బులు వాటి వివరాలు, వసూళ్ళు చేసినవి ఎంత, వాటి వివరాలు ఇప్పటికి చెప్పడం లేదన్నారు. తమ వెనుక గంజాయి బ్యాచ్ ఉందని బెదిరిస్తున్నారని ఆరోపించారు. కెసిఎస్ ప్రసాద్, శంకర్, గోవింద్రరాజు, సుజి, రవి, అజయ్ కుమార్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


కార్వాన్ న్యూ గంగానగర్ కనకదుర్గ దేవాలయంలో లలిత త్రిపుర సుందరి దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు.


కార్వాన్ సాయి నగర్ లో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ ఠాగూర్ జీవన్ సింగ్


హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అమ్మవారికి పూజలు చేసిన టిఎన్‌జిఓ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీష్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ


నగదుతో లక్ష్మీదేవి అలంకారంలో విజయగణపతి ఆలయంలో అమ్మవారు


చిక్కడపల్లి బాపూనగర్‌లో రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో లలితాదేవి అలంకారంతో అమ్మవారు


నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు కాళికా అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు


,శ్రీ భక్తహనుమాన్ దేవాలయంలో అమ్మ వారి వద్ద పూజలు నిర్వహిస్తున్న స్థానికులు.


నిజాంపేట్‌లో వెలసినటువంటి పురాతనమైనటువంటి శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కుటుంబ సభ్యులు


రాజ్‌నగర్‌లో దేవీ నవరాత్రులు సందర్భంగా అమ్మవారి మండపం వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్.


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈటెల రాజేందర్, వడ్డేపల్లి రాజేశ్వరరావు

## విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు కార్మికులపై దాడి

**దుండిగల్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు కార్మికులపై ఓటీ టైం యజమాని అతని కుమారులు దాడి చేయగా ఓ కార్మికునికి తీవ్రగాయాలు అయ్యాయి. మరో ఇద్దరు మహిళా కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే స్థానికంగా ఉండే ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం అందుకున్న మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర నాయక్ ఆసుపత్రికి వెళ్లి గాయపడ్డ కార్మికులను పరామర్శించి మెరుగైన చికిత్స అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు. కాగా కార్మికులపై దాడి జరిగి న సంఘటనను తెలుసుకున్న మున్సిపల్ కార్మికులు బహదూరపల్లిలోని సిరి సంపద ఫుడ్ కోర్ట్ పక్కన ఉన్న శ్యాం టీ టైం ముందు సిఐటియు నాయకుడు బొడిగే లింగ స్వామి ఆధ్వర్యంలో ధర్నాకు దిగారు. స్థానికుల సమాచారం ప్రకారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని బహదూర్‌పల్లి మున్సిపల్ కార్మికులు దుద్దు సురేందర్, దుద్దు బాలమని, కొమ్ము వెంకటమ్మ రోజులాగే శనివారం ఉదయం ఆరు గంటలకు బహదూరపల్లి వీధుల్లో చెత్త ఊడ్చే పనిలో పడ్డారు. సిరి


గాయపడిన కార్మికున్ని పరామర్శిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్..

సంపద ఫుడ్ కోర్ట్ పక్కన ఉన్న శ్యాం టీ స్టాల్ దగ్గరకు రాగానే టీ స్టాల్ ముందు రోడ్డుపై చెత్త వేస్తుండగా మున్సిపాల్ కార్మికుడు దుద్దు సురేందర్ టీ స్టాల్ యజమాని శ్యాంను వారించాడు. మాటా మాటా పెరగడంతో అదుపుతప్పిన శ్యాం అతని కుమారులు మొత్తం నలుగురు కలసి మున్సిపల్ కార్మికుడు దద్దు సురేందర్‌ను విచక్షణా రహితంగా దాడి చేశారు. అడ్డు తగిలిన మరో ఇద్దరు మహిళా కార్మికులు దుద్దు బాలమని, కొమ్ము వెంకటమ్మలపైన దాడికి దిగాడు. అక్కడే ఉన్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్ భరత్ కుమార్ వారించారు. కార్మికులకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

## తెలుగు సాహిత్యానికే తలమానికం చిలకమర్తి : కె.వి.రమణాచారి

**రవీంద్రభారతి, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** చిలకమర్తి లక్ష్మీనరసింహం ఇరవై రెండేళ్ల వయస్సులో రచించిన గయోపాఖ్యానం అనే నాటకం ప్రతులు లక్షకుపైగా అమ్ముకుపోవడమనేది తెలుగు సాహిత్యానికే తలమానికం, మకుటాయమానమని విశ్రాంత ఐఎఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, డా. కె.వి.రమణచారి అన్నారు. గొప్ప కవి, రచయిత, నాటకకర్త, విద్యావేత్త, సంఘ సంస్కర్త అయిన చిలకమర్తి 19చివర, 20వ శతాబ్ధం ఆరంభకాలంలో తెలుగు సాహిత్యం అభివృద్ధికి, తెలుగునాట ఆధునికభావాల వికాసానికి పట్టుకొమ్మలై తెలుగుభాష సాహిత్యాలను సుసంపన్నం చేశారని కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఎన్.ముక్తేశ్వరరావు అధ్యక్షతన జరిగిన చిలకమర్తి లక్ష్మీనరసింహం 158వ, చిలకమర్తి మల్లయ్యశాస్త్రి 106వ జయంతి సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు సుబ్బరాయశర్మ, చిలకమర్తి సోదరులు, కిన్నెర రఘురాం తదితరులతో కలిసి ప్ర


కిన్నెర–చిలకమర్తి సాహితీ పురస్కారంతో రామచందర్‌రావు దంపతులను సత్కరిస్తున్న రమణాచారి, రఘురాం, ముక్తేశ్వరరావు తదితర అతిథులు

ముఖ నాటక రచయిత, నటుడు, దర్శకుడు తడకమళ్ళ రామచందర్‌రావు దంపతులను ఘనంగా సత్కరించి కిన్నెర–చిలకమర్తి సాహితీ పురస్కారం బహూకరించి శుభాభినందనలు తెలిపారు. తడకమళ్ళ 6దశాబ్ధాలుగా తెలుగు నాటకరంగంలో నటుడు, రచయిత, దర్శకుడుగా తనదైన ముద్రవేసుకున్నారన్నారు. ముందుగా సభకు కిన్నెర రఘురాం స్వాగతం పలికారు.

## అమ్మ వారికి ఉప ముఖ్యమంత్రి భట్టి సతీమణి పూజలు

**బేగంపేట సెప్టెంబరు 27,ప్రభాతవార్త**

దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం బేగంపేట శ్రీ కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీభువనేశ్వరీదేవీ అలంకారంలో అమ్మ వారు భక్తులకు దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా అమ్మ వారికి తెలంగాణా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని ఆలయాన్ని సందర్శించి అమ్మ వారికి పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఈ ఓ విఠలయ్య,ఫౌండర్ ఛైర్మన్ చెక్కల సుభాష్ ముదిరాజ్‌లు నందినిని ఘనంగా సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహింపజేసారు.తీర్థ ప్రసాదాలను అందజేసారు. ఈ సందర్భంగా నందిని భట్టి మాట్లాడుతూ అమ్మ వారు ప్రజలందరినీ చల్లంగా చూడాలని,రోగాల బారిన పడకుండా రక్షించాలన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసారు.శ్రీకట్టమైసమ్మ అమ్మ వారి ఆలయంలో శ్రీభువనేశ్వరీదేవి అమ్మ వారిని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ,కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు విశాల్‌సుధాం,


భువనేశ్వరీదేవీ అమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని.

రాజేందర్,దర్శించుకుని పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ ఛైర్మన్ చెక్కల సుభాష్ ముదిరాజ్ కోట నీలిమ,కాంగ్రెస్ నాయకులను సత్కరించి పూజలు నిర్వహింపజేసారు.అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసారు.

## లంగర్‌హౌస్ వద్ద మూసీలో మునిగిన "బాపూఘాట్"

**- బాధపడుతున్న గాంధేయ వాదులు**

**నార్సింగి, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త :** భారీ వర్షాల కారణంగా మహోగ్రరూపం దాల్చిన మూసీనది లంగర్‌హౌస్‌లో జాతిపిత పేరుపై ఉన్న "బాపూఘాట్"ను ముంచెత్తింది. ప్రతీ ఏటా మహాత్ముడి జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారింగా నిర్వహించే బాపూ సమాది పూర్తిగా మూసీనదిలో మునిగిపోయింది. ఇక్కడ అసలు సమాదే కనిపించడం లేదు. శనివారం ఉదయం లంగర్‌హౌస్–అత్తాపూర్ బ్రిడ్జి పైనుంచి వెళ్లే ప్రజలు బాపూఘాట్‌ను మూసీ ముంచేయడంను గమనించారు. ఆ నోటా ఈ నోట ఈ విషయం గాంధేయవాదుల చెవిన పడింది. చాలా మంది గాంధేయవాదులు అటుగా వచ్చి బాపూ సమాది కనిపించడం లేదంటూ బాధపడ్డారు. ఇక్కడ బాపూజీ సమాది కట్టిన తరువాత మొదటి సారిగా వరద నీటిలో మునిగి పోయిందని స్థానికులు పేర్కొన్నారు. రెండు దశాబ్దాల తరబడి లంగర్‌హౌస్ బాపూఘాట్‌లో గాంధీజీ జయంతి,వర్ధంతి వేడుకలను ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న అన్ని ప్రభుత్వాలు వేడుకలు, ఆ వేడుకలు ముగిసిన తరువాత ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా బాపూ సమాధి వరద నీరు,


మూసీ నదిలో మునిగిపోయిన లంగర్‌హౌస్‌లో ఉన్న బాపూఘాట్ దృశ్యం

బురద నీరు, నెలల తరబడి ఊడ్చకపోవడంతో చెత్తతో నిండిపోయినా పట్టించుకోవడం లేదంటూ గాంధేయ వాదులు, స్థానికులు వాపోయారు. గతంలో పలుమార్లు పందులు, కుక్కలు కూడా బాపూ సమాధి వద్ద వచ్చి అక్కడి పరిసరాలను అపరిశుభ్రంగా మార్చేవని, గేటు అమర్చిన తరువాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంలోని పెద్దలు, అధికారులు స్పందించి జాతిపిత మహాత్మాగాంధీ సమాధి వద్ద పరిశుభ్రత, పవిత్రతను పెంచే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

## మైనారిటీ మద్దతు బిఆర్ఎస్‌కే : కెటిఆర్


జూబ్లీహిల్స్ నియోజవకర్గం సుల్తాన్‌నగర్‌కు చెందిన మైనారిటీ నాయకులు మహ్మద్ నక్షా బందీని కలిసి మద్దతు కోరిన మాజీ మంత్రి కేటీఆర్.

**యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

రాబోయే ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలిపించుకునేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుంటూ మైనారిటీల మద్దతు కూడగట్టుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. నియోజకవర్గంలో మైనారిటీ ఓట్లు అధికంగా ఉండటంతో బలమైన నాయకుడు సుల్తాన్‌నగర్‌కు చెందిన అహ్మద్ నక్షా బంది ఇంటికి వెళ్లి ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు పలకాలని కోరారు. కేటీఆర్‌తో పాటు మాజీ హోంమంత్రి మహ్మూద్ అలీ, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ మసిఉల్లా, ఇంతియాజ్‌తో పాటు పలువురు మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

### కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ సిపి తనిఖీ

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్ రికార్డులను లాకప్‌ను పరిశీలించారు. స్థానికంగా పోలీస్ స్టేషన్‌లో ఉన్న పెండింగు కేసుల వివరాలను ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యల విషయమై పోలీస్ స్టేషన్ సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుండి అందే ఫిర్యాదులను అందుకొని వారికి న్యాయం చేయాలని అలాగే శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిపి సూచనలు చేశారు.

### మూసి వరద బాధితుల కోసం 10 పునరావాస కేంద్రాలు : కమిషనర్ ఆర్ వి కర్ణన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** మూసి వరద ప్రభావితుల కోసం జీహెచ్‌ఎంసీ పలు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు మొత్తం 1,467 మంది బాధితులు ఈ కేంద్రాల్లోకి తరలించారు.మలక్‌పేట్, అంబర్‌పేట్, గోషామహల్ సర్కిల్స్ పరిధిలోని పాఠశాలలు, కమ్యూనిటీ హాల్స్, మొదలైన ప్రదేశాలను పునరావాస కేంద్రాలుగా మార్చి బాధితులకు తక్షణ సాయం అందిస్తున్నారు.ఈ కేంద్రాల్లో బాధితులకు భోజనం, తాగునీరు, ఆరోగ్య శిబిరాలు, అవసరమైన వారికి వైద్య సేవలు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ స్వయంగా ఈ పునరావాస కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు చూడాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

### విజయ స్వర్ణ నంది పురస్కారాల ప్రదానం


విజయ స్వర్ణ నంది పురస్కారాల ప్రదానం చేస్తున్న అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

**చిక్కడపల్లి, సెప్టెంబరు 27ప్రభాతవార్త:** చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో దేవినవరాత్రులు సందర్భంగా శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ నిర్వాహకుడు కృష్ణ ఆధ్వర్యంలో సాహిదుర్గె సంగీత నాట్యోత్సవం, విజయ స్వర్ణ నంది పురస్కారాల ప్రదానోత్సవ సభ శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై పురస్కారాలను ప్రదానం చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యువకళావాహిని సంస్థ అధినేత లంక లక్ష్మి నారాయణ, డీసీపీ తెజవత్ రాందాస్, అంజనీ కుమారి, బీజేపీ నాయకుడు వంశీ, యోగ టీచర్ వరలక్ష్మి, రమేశ్,అనిత తదితరులు పాల్గొన్నారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**అల్వాల్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** దొంగతనానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఇంటి యజమానురాలు రావడంతో చేతికి చిక్కిన బంగారంతో ఉడాయించిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మచ్చబొల్లారం ముస్లిం బస్తీలో నివసించే అలీషాభాను కుటుంబ సమేతంగా శుక్రవారం మద్యాహ్నం ఓల్డ్ సిటీలో బంధువులు ఇంటికి వెళ్ళింది. రాత్రి 9 గంటలు సమయంలో అలీషాభాను ఇంటికి తిరిగి రాగా లోపల లైటు వేసి ఉంది. కిటికి నుంచి లోపలకి చూడగా సామాన్లు చెల్లాచెదురుగా పడేసి ఉన్నాయి. ఒక్కసారిగా ఆమె అరవడంతో దొంగ ఇంటి నుంచి పారి పోయాడు. ఏడు తలాలు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

## కళాకారుడు వెంకటేష్‌కు కళా నటరత్న పురస్కారం


వెంకటేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త**

కూకట్‌పల్లికి చెందిన ప్రముఖ కళాకారుడు ఏ.వెంకటేష్‌కు కళా నటరత్న పురస్కారం లభించింది. సర్వేస్వరా నాట్య మండలి హైదరాబాద్ వారు ఈ పురస్కారాన్ని వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ నాకు మొదటి నాటక గురువు టి రాజబాబు, బాబు రాజులని నన్ను 1999లో బొబ్బిలి యుద్ధం అనే నాటకం ద్వారా పరిచయం చేసి తరువాత ఎన్నోనాటకాలల్లో నన్ను ప్రోత్సహించిన గురువులని కొనియాడారు. వారి ప్రోత్సాహం వల్ల తాను ఇప్పటి వరకు ఎన్నో నాటికలు, నాటకాలు, సీరియల్స్, సినిమాలు చేస్తూనే వున్నాను అన్నారు. ఇన్ని సంవత్సరాల నుండి ఈ నాటక రంగంలో వున్నాను అంటే నా మొదటి గురువు రాజబాబు అని ఆయనకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు చెప్పారు. ఈరోజు నాకు కళానట రత్న పురస్కారం ఇచ్చి నన్ను ఆశీస్సులు అందచేసినందుకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలుపుతున్నట్లు వెంకటేష్ చెప్పారు. గౌరవ అతిధి పెద్దలు కటారి సత్యనారాయణ, విశిష్ట అతిధి గుంపుల సుదర్శన్, ముఖ్య అతిధి పుచ్చా సాంబ శివా రెడ్డి, ఆత్మీయ అతిధి బి వి కాటంరాజు, శ్రీనివాస్‌ల చేతుల మీదుగా నాకు కళానటరత్న పురస్కారం అందించినదుకు ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదములు తెలుపుతున్నానని వెంకటేష్ పేర్కొన్నారు.

### మారేడ్‌పల్లి న్యూక్లబ్‌ను ఫ్రీ హోల్డ్ చేయాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్


మారేడ్‌పల్లిన్యూ క్లబ్‌ను ఫ్రీ హోల్డ్ చేయాలని మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్,క్లబ్ కమిటీ ప్రతినిధులు

**కంటోన్మెంట్,సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన ఫ్యామిలీ న్యూ క్లబ్‌ను ఫ్రీ హోల్డ్ చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, క్లబ్ అధ్యక్షులుప్రతాప్‌రెడ్డి,మాజీ అధ్యక్షులు నోముల ప్రకాశ్,ఉపాధ్యక్షులు ప్రశాంత్‌లు శనివారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దాదాపు 80 సంవత్సరాల చరిత్ర కలిగిన న్యూ క్లబ్ లీజ్ రూపంలో ప్రభుత్వం నుంచి లీజ్ రూపంలో కొనసాగుతుందని తెలిపారు. దాదాపు 3 వేల సభ్యులతో ఉన్న న్యూ క్లబ్‌ను ప్రభుత్వం లీజ్‌ను రద్దు చేసి ఫ్రీ హోల్డ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలోక్లబ్ మెంబర్లు మధుసూదన్, రాజశేఖర్, వెంకట్, వినోద్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ


బతుకమ్మతో మేయర్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక" అని నగర మేయర్ గద్వాల్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి లు అన్నారు. శనివారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. మహిళా అధికారులు, ఉద్యోగినులు, కార్పొరేటర్లతో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి లు బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ."బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక" అని పేర్కొన్నారు. మహిళా సంక్షేమానికి ప్రజా ప్రభుత్వ పాలన ట్రేడ్ మార్క్‌గా నిలుస్తోందన్నారు. తెలంగాణ మహిళల సాధికారత, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది అని తెలిపారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా ప్రభుత్వానికి మహిళలు ఆశీస్సులు అందిస్తూ వెన్నుదన్నుగా నిలవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మహిళా అధికారులు, కార్పొరేటర్లు పెద్ద ఎత్తున పాల్గొని బతుకమ్మ పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

## శ్రీవాణి మహిళా కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు




శ్రీవాణి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులతో కలిసి బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్న కళాశాల కరస్పాండెంట్ సుభాష్ గౌడ్ తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**
మలక్ పేట లోని శ్రీవాణి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శ్రీవాణి మహిళా జూనియర్, డిగ్రీ, పిజి కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బతుకమ్మ వేడుకలలో కళాశాల విద్యార్థులు సాంప్రదాయక దుస్తులను దరించి భక్తిశ్రద్ధలతో వివిధ రకాల రంగు రంగుల పూలతో సుందరంగా బతుకమ్మలను రూపొందించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సాహంగా బతుకమ్మ పాటలను పాడుతూ అంగరంగ వైభవంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ గౌడ్ మాట్లాడుతూ పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, తెలంగాణ ప్రాంత సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడంతో విద్యార్థులకు మన పండుగలు, వాటి విశిష్టత, ప్రాధాన్యత గురించి అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విమలారెడ్డి, అధ్యాపకులు అనుప్రియ, గిరిధర్, జాన్, హమీదుల్లా ఖాన్, రాములు, కార్తీక్ లాల్, శ్రీలక్ష్మి, బిందు, దామిని తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి గోదా పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు

**వనస్థలిపురం సెప్టెంబర్.27, ప్రభాతవార్త :**
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని జనప్రియ హోమ్స్ ,చింతల కుంటలో గల శ్రీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సెప్టెంబర్ 28 నుండి అక్టోబర్ 3 వరకు ఆలయ 25 వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ చైర్మన్ పి.వి.నరసింహారావు తెలిపారు. 28 ఆదివారం అంకురార్పణ, సోమవారం ధ్వజారోహణం,మంగళవారం స్వామి వారి కల్యాణోత్సవం, బుధవారం 108 కలశం లతో అభిషేకం, గురువారం విజయదశమి న స్వామివారి కి ప్రత్యేక పూజలు వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఘనంగా నిర్వహించబడతాయని,భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని ఆయన కోరారు.

## త్రిశక్తి ఆలయంలో కొనసాగుతున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు

**వనస్థలిపురం. సెప్టెంబర్ .27.ప్రభాతవార్త.**
బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురం కాలనీలో గల శ్రీ త్రీ శక్తి ఆలయంలో దేవి నవరాత్రుల సందర్భంగా ఆరవ రోజు శ్రీ మాహా దుర్గాదేవి ని శ్రీలలితా దేవి గా,శ్రీ మహా సరస్వతీదేవి ని శ్రీ అన్నపూర్ణ దేవి గా, శ్రీ మహా లక్ష్మీదేవి ని శ్రీ ధన్య లక్ష్మీదేవి గా పురోహితులు సుధాకర శర్మ,సహాయకులు శివకుమార్,శ్రీ సాయి లతో కలిసి అలంకరించారు.భక్తులకు ఆల య కమిటీ సభ్యులు, వాలంటీర్లు పూజ కార్యక్రమాలు, తీర్థప్ర సాదాలు ఏర్పాట్లు చూసారు. ఈ కార్యక్రమంలో సంకల్పకర్త, ఆలయ కమిటీ చైర్మన్ డి.విజయ భాస్కర్,మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్.నారాయణరెడ్డి, ఈశ్వర నాయుడు,వెంకటేశ్వర్లు, మురళీ కృష్ణ, రవీందర్,గోవింద నాయక్, వెంకటయ్య, రంగనాథం, వి.ఏ.కె మూర్తి,ఆలయ మహిళా ధర్మ కర్తలు,అమ్మవార్ల సేవకులు వనజాక్షి,శ్యామల, రజిత,సరళ, సులోచన, రమాదేవి,చంద్రకళ, శారద తదితరులు పాల్గొన్నారు.



శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో శ్రీ దుర్గాదేవి

## ఏకగ్రీవంగా షిర్డీసాయి బాబా నూతన కమిటీ ఏర్పాటు



శ్రీ షిర్డీసాయి బాబా సంస్థాన్ నూతన కమిటీ సభ్యులు.

**వనస్థలిపురం సెప్టెంబర్.27.ప్రభాతవార్త**
వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ లో గల శ్రీ షిర్డీసాయి బాబా సంస్థాన్ ఆలయానికి నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది.ఆలయ చైర్మన్ గా పి.ఈశ్వరమ్మ యాదవ్, వైస్ చైర్మన్ గా డి.వేణుగోపాల్ రావు,ప్రధాన కార్యదర్శి గా జె.రవీంద్ర బాబు,జాయింట్ సెక్రటరీ గా బి.ప్రభాకర్, కోశాధికారి గా టి. రమేష్,సభ్యులుగా ఆర్.అంజయ్య,నిర్మలా చౌదరి, రాజేంద్రప్రసాద్, వై.సీతా రామిరెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. రెండు సంవత్సరాల పాటు నూతన కమిటీ పదవిలో ఉంటుంది. ఆలయ అభివృద్ధి కి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

## 29న మలక్ పేట కేర్ ఆసుపత్రిలో ఉచిత గుండె వైద్య పరీక్షలు : డాక్టర్ నవీన్ కుమార్




కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేర్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, కార్డియాలజీ హెడ్ డాక్టర్ నవీన్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** మలక్ పేట కేర్ ఆసుపత్రిలో ఈనెల 29వ తేదీ సోమవారం ఉచిత గుండె ఆరోగ్య వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆసుపత్రి కార్డియాలజీ హెడ్ డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహించనున్న ఉచిత గుండె ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన కేర్ హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఎడ్ల తో కలిసి వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి వివరాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మలక్ పేట కేర్ ఆసుపత్రిలో ఉచిత గుండె ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి ఉచితంగా ఈసీజీ, 2డి ఇకో, టిఎంటి పరీక్షలతో పాటు కార్డియాలజీ కన్సల్టేషన్ ను కూడా ఉచితంగా అందించడం జరుగుతుందని వివరించారు. యాంజీయో గ్రామ్ అవసరం అని గుర్తించిన వారికి తగ్గింపు ధరల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. యువతలో గుండె సంబంధిత ప్రమాదాలు, అసాధారణలను ముందుగానే గుర్తించడం కోసం ఉచిత గుండె ఆరోగ్య వైద్య శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు. గుండె సమస్యల సాంకేతాలు ఉన్నవారు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఆచార్యకొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక : మంత్రి శ్రీధర్ బాబు

**అబ్దుల్లాపూర్ మెంట్ ,సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**
తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా, తెలంగాణ ఉద్యమానికి ఆత్మగా నిలిచిన ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకుని ఎల్బీనగర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆచార్యకొండ లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఎల్ .రమణ, రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడమే కాకుండా తెలంగాణ రాష్ట్రం కోసం కొండ బాపూజీ అహర్నిశలు కృషి చేశారని గుర్తు చేశారు. వెనుకబడిన వర్గాల హక్కుల సాధన, రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడని అభివర్ణించారు. ప్రజల కోసం పదవులను వదులుకుంటూ త్యాగం చేసిన గొప్ప నాయకుడు ఆయన జీవితం త్యాగం, నిబద్ధత నిస్వార్థం కు ప్రతీక అని పేర్కొన్నారు. చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ఉదయం నుంచి తనతో ఉండి విగ్రహావిష్కరణకు రావాలని పట్టుబట్టి తీసుకొచ్చారని మంత్రి శ్రీధర్ పేర్కొన్నారు. అదేవిధంగా విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముందు నుండి సహకరించిన మల్ రెడ్డి రాంరెడ్డి కి బీసీ కులాల సమన్వయ వేదిక నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, బీసీ కులాల సమన్వయ వేదిక నాయకులు బొమ్మ రఘురాం నేత, బొమ్మ దశరధనేత, చేనేత నాయకులు తడక యాదగిరి నేత, ప్రొఫెసర్ వేముల రాము నేత పాల్గొన్నారు.



కొండ లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చిత్రంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, రోడ్డు డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి తదితరులు

# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న బడంగ్‌పేట్ కమీషనర్ సరస్వతి



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పున్న గణేష్‌నేత



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని నిర్వహిస్తున్న మీర్‌పేట్ కమీషనర్ నాగమణి

**సరూర్‌నగర్‌లో...**
**సరూర్‌నగర్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అవతరణ కోసం ఎలుగెత్తి పోరాడిన తెలంగాణ గర్వించదగ్గ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి శనివారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఘనంగా జరిగింది. కమీషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి కమీషనర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ జాన్కృపాకర్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ వేణు గోపాల్‌రెడ్డి, ఎఇ హరీష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరి, సీనియర్ అసిస్టెంట్ మమతారెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మీర్‌పేట్‌లో ...**
స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శనివారం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఘనంగా నిర్వహించారు. కమీషనర్ నాగమణి బాపూజీ చిత్రపటానికి పుష్పాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ సంరెడ్డి నాగేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆర్కేపురం డివిజన్‌లో...**
**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ టెలిఫోన్‌కాలనీ చౌరస్తాలో స్వాతంత్ర సమర యోధుడు, మాజీ మంత్రి, తెలంగాణ జాతిపిత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జెల్ల జగన్నాథం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత ముఖ్యఅతిథిగా హాజరై కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి, బండి మధు, శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చైర్మన్ తల్లాటి రమేష్‌నేత, బొడ్డుపల్లి మహేందర్, దుర్గాప్రసాద్, సాయికుమార్, పెద్దవుర సైదులు, పగడాల ఎల్లయ్య, పొట్టబతిని నగేశ్, ఇడం భాస్కర్, పున్న కృష్ణయ్య, దొర్నాల చంద్రమౌళి, శశి యాదవ్, మనికంఠ, చీలువేరు మహేందర్, రాజురెడ్డి, అవ్వారి సంతోష్, అచ్చయ్య, జెల్లా నగేష్, రంగారావు, విప్లవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు

**ఉప్పల్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ మహంకాళి దేవాలయంలో శనివారం అమ్మ శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు గంట్లబొట్ల వెంకటరమణ శర్మ (కన్నయ్య) ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం జరిగిన పూజ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తెల్కల మోహన్‌రెడ్డి, పలువురు ఆలయ కమిటి సభ్యులు అలుగుల అనిల్, రాఘవేంద్ర, గుమిడెల్లి కృష్ణ, ఈదుల కాసిరెడ్డి, పబ్బతి శేఖర్‌రెడ్డి, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, దేవి అభిషేకం, తిరుమంజన సేవ, దేవి అలంకరణ, ప్రభాత దర్శనం, ఏకాదశ హారతులు, చతుష్టపచార పూజలు, కుంభ హారతి, తీర్థ ప్రసాద వితరణ, దుర్గా హోమం, సాయంత్రం ప్రదోష కాల, చతుషష్టుపచార పూజ, సామూహిక అష్టోత్తర కుంకుమార్చనలు, నక్షత్ర హారతి, తీర్థ ప్రసాద వితరణ, ఏకాంత సేవ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదుల కాసిరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు బిక్కుమళ్ల అంజయ్యగుప్త, సల్ల రాజిరెడ్డి, ఈగ ఆంజనేయులు, భాస్కర్, అన్నపు రెడ్డి కృష్ణారెడ్డి, నరేష్, శాగ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ తెల్కల మోహన్‌రెడ్డి, ఈదుల కాసిరెడ్డి తదితరులు

## బడంగ్‌పేట్‌లో దుర్గామాతకు పారిజాత పూజలు



దుర్గామాతకు పూజలు చేసిన మాజీ మేయర్ పారిజాత: చిత్రంలో వంగేటి ప్రభాకర్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, బంగారు ప్రభాకర్ తదితరులు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ పోచమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవా సందర్భంగా ఏర్పాటు చేసి మండపంలో ప్రతిష్టించిన దుర్గామాతకు మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ తదితరులతో కలిసి హాజరైన ఆమె అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం పారిజాతను శాలువాతో సన్మానించి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బంగారు ప్రభాకర్, బొల్లపల్లి కుమార్, రవి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ మండలం మామిడిపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరై పూజలు నిర్వహిస్తున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

## ఎంవిఎస్ఆర్ కాలేజీలో ఘనంగా బతుకమ్మ, ఆయుధ పూజ




బతుకమ్మ ఉత్సవాల్లో ఆట పాటలతో సందడి చేస్తున్న ఎంవిఎస్ఆర్ కాలేజీ విద్యార్థినిలు

**సరూర్‌నగర్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:** నాదర్‌గుల్‌లోని ఎంవిఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం దసరా ఉత్సవాల్లో భాగంగా బతుకమ్మ సంబరాలు, ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థినిలు, అధ్యాపకురాళ్ల అందమైన బతుకమ్మలను తయారు చేసి వాటిని పూజించి తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబింపజేసే విధంగా ఆట పాటలతో సందడి చేశారు. అదే విధంగా కాలేజీ యాజమాన్యం ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో పరికరాల పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ పివిఆర్ కశ్యప్, కార్యదర్శి కెపి శ్రీనివాసరావు, కోశాధికారి జూపూడి సుధాకర్, జాయింట్ సెక్రటరీ సూర్య ప్రభాకర్, పలువురు సభ్యులు, కాలేజీ ప్రినిపాల్, పరీక్షల కంట్రోలర్ ప్రొఫెసర్ కామేశ్వర్‌రావు, ప్రొఫెసర్ వర్ధిని, పలువురు డీన్‌లు, హెచ్‌ఓడిలు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

**ఎల్.బి.నగర్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:**
దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీదుర్గదేవి మాతకి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని శ్రీఖిల్లామైసమ్మ సేవ సమితి(సేవాదళ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు శ్రీదుర్గామాత అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి పూజలు చేసినా అనంతరం నిర్వాహకులు ఆయనను శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌గౌడ్, కరుణాకర్, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం చైర్మెన్ తలాటి రమేష్ నేత, పగడాల శ్రీశైలం శ్రవణ్, శ్రీనివాస్ యాదవ్, బబ్లూ, మామిడి రామకృష్ణగౌడ్,వెంకట్‌రమణరెడ్డి, రఘు పాల్గొన్నారు.



అమ్మవారి పూజలో పాల్గొన్న ఉపేందర్‌రెడ్డి

## మహాలక్ష్మి దేవి అలంకారంలో శ్రీ విజయ దుర్గ మాత



శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో శ్రీ విజయ దుర్గ మాత

**సైదాబాద్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:** సైదాబాద్ మాతా మైదానంలో కొలువుదీరిన శ్రీ విజయ దుర్గ మాత శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## శ్రీ లలిత త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**సైదాబాద్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త:**
బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ చైతన్య నగర్ కాలనీలోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలోని అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి చైర్మన్ పూరెల్లి శివకుమార్, కోశాధికారి ఏలె చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



శ్రీ లలిత త్రిపుర సుందరిదేవి అలంకారంలో అమ్మవారు

## పండుగలు సంప్రదాయాలకు ప్రతిరూపాలు




అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:**
పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు పేర్కొన్నారు. ముసారాంబాగ్ లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు రంగురంగుల, విభిన్నమైన పూలతో బతుకమ్మలను సుందరంగా పేర్చి, పసుపు గౌరమ్మలు, పసుపు, కుంకుమ, గంధంతో బతుకమ్మలను అలంకరించి, ఆధ్యాత్మిక భావనలతో, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆటలు, పాటలు పాడుతూ బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుర్గానగర్ కాలనిలో ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సావాలు



**తుర్కయంజాల్ సెప్టెంబర్ 27, ప్రభాతవార్త .**
తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజపూరులో శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి యువతులు, మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భజనలు, కోలాటాలు, బతుకమ్మ ఆటలతో అమ్మవారిని పూజిస్తుండటంతో ఇంజాపూర్ గ్రామం భక్తిపారవశంతో నిండిపోయింది. ఈ కార్యక్రమంలో యువతులు, మహిళా భక్తులు, భక్తులు పాల్గొన్నారు.

# గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి




**మల్కాజిగిరి సెప్టెంబర్.27.ప్రభాతవార్త :**
గౌతమ్ నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ ను గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోనికాలలో మౌలిక వసతులు పెండింగ్లో ఉన్నాయని పెండింగ్లో ఉన్న విధులు మంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ తదితరులు ఉన్నారు

## ముగిసిన నార్ముల్ మదర్ డెయిరీ ఎన్నికలు

### ఇద్దరు బిఆర్ఎస్... ఒక కాంగ్రెస్ అభ్యర్థి విజయం



గెలుపొందిన డైరెక్టర్లు వరుసగా లక్ష్మీనర్సింహా రెడ్డి, భాస్కర్ గౌడ్, జయశ్రీ

**హయత్ నగర్, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త:**
నార్ముల్ మదర్ డెయిరీ పాలకవర్గ సభ్యుల ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. రెండు జనరల్ స్థానాలకు సంబంధించి ఐదుగురు పోటీపడగా బీఆర్ఎస్ మద్దతు దారులు సందిల భాస్కర్ గౌడ్, రచ్చ లక్ష్మీనర్సింహా రెడ్డిలు విజయం సాధించారు. ఒక మహిళా జనరల్ స్థానానికి కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మద్దతుతో కర్నాటి జయశ్రీ గెలుపొందారు. మొత్తం 311 మంది సొసైటీ చైర్మన్లకు 308 మంది ఓటింగ్ లో పాల్గొన్నారు. భాస్కర్ గౌడ్ కు 240 ఓట్లు రాగా, లక్ష్మీ నర్సింహారెడ్డి కి 154 ఓట్లు పోలయ్యాయి. ఇక జయశ్రీకి 176 ఓట్లు వచ్చాయి. లక్ష్మీ నర్సింహా రెడ్డి కేవలం 2 ఓట్ల అధిక్యతతో గెలుపొందడం విశేషం.

## గొప్ప పండుగ బతుకమ్మ : చైర్మన్ రాజేశ్వర్ రెడ్డి




ప్రగతి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

**మలక్ పేట ,సెప్టెంబర్ 27, ప్రభాతవార్త:** తెలంగాణలోనే కనిపించే అతి గొప్ప పండుగ బతుకమ్మ పండుగ అని ప్రగతి డిగ్రీ కళాశాల కో ఎడ్యుకేషన్ చైర్మన్ ఆర్ .రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. దిల్ షుక్ నగర్ ప్రగతి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. కళాశాల విద్యార్థులు పలు రకాల రంగు, రంగుల పూలను ప్రత్యేకంగా సుందరంగా బతుకమ్మలుగా పేర్చి, అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, బతుకమ్మ పాటలు పాడుతూ వైభవంగా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా శక్తికి నిదర్శనం బతుకమ్మ ఉత్సవాలు అని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి. చిన్నారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తుర్కయాంజాల్ పురపాలక సంఘంలో బతుకమ్మ సంబరాలు



**తుర్కు యంజాల్ సెప్టెంబర్27, ప్రభాతవార్త**
తుర్కయాంజల్ పురపాలక పరిధిలోని ఎన్ఎస్ఆర్ నగర్ కల్యాణ మండపంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మున్సిపల్ కమీషనర్ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ అమరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బతుకమ్మ పండుగ యొక్క సాంస్కృతిక, సామాజిక ప్రాధాన్యత గురించి వివరించారు. కార్యక్రమంలో పురపాలక పరిధిలోని అన్ని వార్డుల సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, కార్యాలయ సిబ్బంది ప్రత్యేకంగా తయారు చేసిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి.పోటీ రూపంలో నిర్వహించిన బతుకమ్మలలో,కోహెడ బతుకమ్మకు మొదటి బహుమతి,మునుగనూర్, తుర్కయ్యాజాల్, కమ్మగూడ బతుకమ్మలకు రెండవ బహుమతి ఇంజాపూర్, రాగన్నగూడ బతుకమ్మలకు మూడవ బహుమతి తొర్రూరు, బ్రాహ్మణపల్లి బతుకమ్మలకు నాలుగవ బహుమతి లభించాయి. అలాగే మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారైన బతుకమ్మకు ప్రత్యేక బహుమతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఆఫీసర్ శ్రీనివాసులు, సానిటరీ ఇన్స్పెక్టర్ వనిత, అసిస్టెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, అకౌంటెంట్ ఉషా, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు వినయ్, బాల్ రాజ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సురేష్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## చిలుకానగర్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి




చిలుకానగర్‌లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** తెలంగాణ ఉద్యమకారుడు, బడుగు బలహీనవర్గాల స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్‌లో బిఆర్ఎస్ నేత సకినాల ప్రసాద్ ఆధ్వర్యంలో చిల్కానగర్ చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి ఘనంగా ఆమె నివాళులర్పించారు . బన్నాల గీత మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ క్విట్ ఇండియా పోరాటం, గైర్ ముల్కీ ఆందోళన, తెలంగాణ ఉద్యమంలో తమదైన పాత్ర పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, కొక్కొండ జగన్, రామాంజనేయులు,పవన్,శ్యామ్,బంటి పాల్గొన్నారు

## అనుమతి లేని సెల్ టవర్లు తొలగించాలి : ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



రామంతాపూర్ ఇందిరానగర్‌లో సెల్ టవర్ తొలగించాలని నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ శ్రీవాణి తదితరులు

**రామంతాపూర్, సెప్టెంబరు 27 ప్రభాతవార్త :** రామంతాపూర్ ఇందిరానగర్‌లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన సెల్ టవర్ తొలగించాలని స్థానికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఆందోళన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్,కార్పొరేటర్ బండారు శ్రీవాణి మద్దతు పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇందిరానగర్‌లో జనావాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయడం సబబు కాదన్నారు. ప్రజలు రేడియేషన్‌తో ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, భవనానికి అనుమతి లేదని ఆరోపించారు. దీనిపై తాము మున్సిపల్ కార్యాలయంలో పిర్యాదు చేస్తామని తెలిపారు. టవర్ తొలగించేందుకు రెండు రోజులు సమయం ఇస్తామని, లేకుంటే స్థానికులే స్వయంగా తొలగిస్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు వంగాల సంతోష్ గుప్త, పలువురు పార్టీ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కమిషనర్ శైలజ, డ్వాక్రా మహిళలు ,మున్సిపల్ సిబ్బంది